క్లుప్తంగా

రేపు జగనన్న సురక్ష

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రామమూర్తి తెలిపారు. ప్రజల సమస్యలను తెలియజేయడంతోపాటు, 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునన్నారు.

19 లోపు సెల్ఫ్ అఫిడవిట్‌ను అందజేయాలి

చౌడేపల్లె: బోయకొండ ఆలయ పాలక మండలి సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న ఈనెల 19వ తేదీలోపు సెల్ఫ్ అఫిడవిట్‌ను అందజేయాలని దేవస్థానం ఈఓ చంద్ర మౌళి ఆదివారం తెలిపారు. దేవదాయశాఖ ఉప కమిషనర్(కర్నూలు) ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ రూ.100 బాండ్ పేపర్‌పై నిర్దేశిత నమూనాలో అఫిడవిట్‌ను అందజేయాలని సూచించారు. మొత్తం 30 మంది దరఖాస్తు చేసుకున్నారని, వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌పీఎఫ్ ప్రతినిధిగా హేమంత్


నియామకపత్రం అందుకుంటున్న హేమంత్

పుంగనూరు: రాయల్స్ పీపుల్స్ ఫ్రంట్ నియోజకవర్గ యువత అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన హేమంత్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్ నియామకపు ఉత్తర్వులు పంపారు. ఆదివారం తిరుపతిలో ముఖ్య సలహాదారు సురేష్‌బాబు, వేణురాయల్, హరినాథరాయల్, నానిరాయల్ కలసి హేమంత్‌కుమార్‌కు నియామకపు పత్రం అందజేశారు. రాయల్ ఫ్రంట్‌ను పటిష్ట పరిచేందుకు కృషి చేయాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో సోమవారం కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. బీపీ, చక్కెరవ్యాధి, గుండె సమస్యలు, థైరాయిడ్, కడుపునొప్పి, ఊపిరితిత్తుల సమస్యలు, హెర్నియా తదితర వ్యాధులకు అవసరమైన పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

కుప్పంరూరల్: మండల పరిధిలోని కొత్తయిండ్లు గ్రామంలో ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలపై సేవాసమితి సభ్యులు ప్రచారం చేశారు. సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ మాట్లాడుతూ భగవద్గీత పఠిస్తే మనిషి ఎలా నడుచుకోవాలో తెలుస్తుందని, ఎన్నో విజ్ఞాన విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి పుస్తకాలు ఉచితంగా అందజేశారు. సమితి ప్రతినిధులు శరవణ, కృష్ణారెడ్డి, నాగరాజు, శివకృష్ణ, మంజునాథ్, కృష్ణ, వెంకటలక్ష్మి, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేలు ఆర్థిక సాయం

సోమల: మండలంలోని నెల్లిమంద గ్రామ సహాయకుడు వెంకటరమణ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.25 సాయం చేశారు. వెంకట రమణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు డీటీ ప్రకాష్ బాబు ఆగ్రామానికి వెళ్లి వెంకటరమణ భార్యకు రూ.25 వేలను అందజేశారు. వీఆర్వోలు వెంకట్రమణ, సుబ్రమణ్యం, గ్రామ సహాయకులు యువరాజ్, మాలీన్‌బీ పాల్గొన్నారు.

12న లయన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పుంగనూరు: రాంపల్లె లయన్స్ క్లబ్ మందిరంలో ఈనెల 12న క్లబ్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం ఉంటుందని జిల్లా అంబాసిడర్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధ్యక్షుడిగా త్రిమూర్తి రెడ్డి, నూతన కార్యవర్గం పదవి బాధ్యతలు చేపట్టే ఈ సమావేశానికి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు

పాలసముద్రం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే విక్రయాలు జరగాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. మండలంలోని ప్రభుత్వం మద్యం దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ. మద్యం అమ్మకాలపై గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు రోజూ ఉదయం 10.30 గంటలకు ముందురోజు అమ్మకాల నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. రాత్రి వేళల్లో కాపలా తప్పనిసరి అని తెలిపారు.

వీధి వ్యాపారులకు చేయూత


సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్య


సదుం: తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: అహర్నిశలు ఎండనక, వాననక వీధుల్లో వ్యాపారాలు చేసి జీవించే వారికి చేయూతగా సోలార్ దీపాలను అందిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపాలిటిలో వీధి వ్యాపారులకు సోలార్ దీపాలను ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్యతో కలసి పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా వీధి వ్యాపారులను ఆదుకునేందుకు తొలి సారిగా పుంగనూరు నియోజకవర్గంలో 750 మందిని గుర్తించి రూ.3600 విలువ చేసే సోలార్ లైట్లను పంపిణీ చేశామన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.30 లక్షలు ఖర్చు చేసిందని తెలిపారు. ప్రస్తుతం షాపుల వద్ద నుంచి కరెంటు తీసుకుని డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. సోలార్ లైట్లతో వీధివ్యాపారులకు ఖర్చు తగ్గడంతో పాటు వారికి ఇష్టం వచ్చిన ప్రాంతంలో వ్యాపారం నిర్వహించుకునేందుకు వీలుందన్నారు. ఈ దీపాలను త్వరితగతిన సిద్ధంచేసిన సోలార్ సిస్టమ్స్ ఎండీ కమలాకర్, నెడ్‌క్యాప్ జీఎం ఎర్రమరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి, రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

సదుం: విద్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో నూతనంగా మంజూరు అయిన జూనియర్ కళాశాల తరగతులను చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, అనంతపురం ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలికంగా ప్రస్తుతం గదులను ప్రారంభించామని, కళాశాలలో అధునాతన శాశ్వత తరగతి గదుల నిర్మాణం కోసం రూ.1.20 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. పాఠశాలలో నమోదవుతున్న ఉత్తమ ఫలితాల మాదిరిగానే కాలేజీలోను మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం సదుంలో పార్టీ నాయకుడు తేజోప్రకాష్‌రెడ్డికి చెందిన నూతన ఫర్నీచర్ దుకాణాన్ని మంత్రి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌కు రూ.45 లక్షలు మంజూరు

పుంగనూరు: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం పుంగనూరులో జరిగిన సమావేశంలో చౌడేపల్లెలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం పైఅంతస్తు నిర్మాణానికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.45 లక్షలు నిధుల ఉత్తర్వులను అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ ఎంపీపీ అంజిబాబు, రెడ్డెప్పకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ త్వరగా పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కులమతాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. నిధులు మంజూరుచేయించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డికి భవన నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప సేవలో మంత్రి పెద్దిరెడ్డి

సదుం మండలం ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం దర్శించారు. తిరుపతిలో మాలధారణ చేసిన ఆయన ఇక్కడికి వచ్చారు. ఆలయంలోని వినాయక, ఆంజినేయ, నాగమల్లేశ్వర, నవగ్రహ ఆలయాలతో పాటు అయ్యప్పస్వామికి పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేయగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి,


అయ్యప్పస్వామి ఆలయ పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి

జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, కృష్ణారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి సమస్య ఉన్నా తెలియజేస్తే ప్రజా సేవకుడిగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మండలంలోని గోనుమాకులపల్లె పంచాయతీలో ఆదివారం రెండోరోజు చిన్నశ్యామ, నాగిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల, పంచాయతీ అధికారులు, నాయకులతో కలిసి 392 గృహాలను సందర్శించారు. 'అవ్వా మీకు పింఛన్ అందుతుందా..? అక్కా ఇల్లు మంజూరు చేశారా..? సొంతింటిని నిర్మించుకుంటున్నారా..? పథకాల లబ్ధి ఇంటి వద్దకే అందుతోందా..?' అంటూ ప్రజలను పలకరించారు. అర్హులై వరికైనా పథకాలు అందలేదంటే వలంటీర్లకు తెలిపితే వెంటనే లబ్ధి చేకూరేలా చూస్తారని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా సమస్య వస్తే మండల అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేదని, ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని, ప్రజల సమస్యలను 24 గంటల్లో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని యర్రంపల్లెకు చెందిన విమలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.3,70,000 చెక్కును ఎమ్మెల్యే వెంకటేగౌడ అందించారు. ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌రెడ్డి, ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, ఎంపీటీసీ సంపూర్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రెస్కో డైరెక్టర్ భూపతి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఉదయ్, నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కోఆర్డినేటర్లు

స్వచ్ఛంధ్ర కోఆర్డినేటర్లు కృతజ్ఞతలు

తమకు ఉద్యోగాలు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పలమనేరు నియోజకవర్గ స్వచ్ఛంధ్ర మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు ఆదివారం ఎమ్మెల్యే వెంకటేగౌడను సన్మానించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యేను ఐదు మండలాలకు చెందిన కోఆర్డినేటర్లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్లను గత టీడీపీ ప్రభుత్వం తొలగించిందని, ఇచ్చిన హామీ మేరకు స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో మండల రిసోర్స్ కోఆర్డినేటర్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఉద్యోగాలు కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. తామెప్పుడూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వారు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

పలమనేరు: పెన్షనర్ల ఐదు ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి గురురాజారావు అధ్యక్షతన సభ్యులు ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులను పంపారు. ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్ అందేలా చూడాలన్నారు. పెండింగ్ డీఆర్ బకాయిలను, పీఆర్‌సీని చెల్లించాలన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు కృష్ణమూర్తి, లక్ష్మీనరసింహులు, గురుసామినాయుడు, బాలసుబ్రమణ్యం, సాంబయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఊహించని అభివృద్ధి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని సినీ హాస్య నటుడు సుదర్శన్ తెలిపారు. ఆదివారం స్నేహితుల బృందంతో కలసి ఆయన బోయకొండకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందించారు. సుదర్శన్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు ఫలించడంతో మొక్కు చెల్లించేందుకు వచ్చినట్లు తెలిపారు. మహాశక్తి స్వరూపిణి అమ్మవారు భక్తుల పాలిట కొంగు బంగారంగా విరజిల్లుతున్నారని పేర్కొన్నారు. పదేళ్ల తర్వాత బోయకొండకు వచ్చానని, ప్రస్తుతం అభివృద్ధి ఊహించని విధంగా ఉందని తెలిపారు. బోయకొండను పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సేవలు అమోఘమని పేర్కొన్నారు.


ఆలయం వెలుపల హాస్య నటుడు సుదర్శన్, మిత్ర బృందం

వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

చౌడేపల్లె: పేదలకు తమ వంతు సహాయం అందిస్తామని లద్దిగం అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం లద్దిగం గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించారు. సుమారు 20 మంది రోగుల ఇళ్లకు వెళ్లి మనోస్థైర్యం నింపుతూ పౌష్టికాహార వస్తువులను అందించారు. సమితి సభ్యులు మునస్వామి, మణి, మునిరాజా, వికాశప్ప, వెంకట్రామయ్య, రమేష్, గోపాల్, పవన్, దిలీప్, జాషువా, మోక్షిత్ పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక

పుంగనూరు: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వారిచే స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ, అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 60 మందికి చికిత్సలు చేశారు. వీరిలో 20 మందిని ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు డాక్టర్ శివ తెలిపారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఆపరేషన్లు చేసి, ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. క్లబ్ ప్రతినిధులు శ్రీరాములు, రజియా, సతీష్‌కుమార్‌రాజు, రఘునాథరెడ్డి, గోపాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అలరించిన దుర్యోధన వధ


భీమ, దుర్యోధన పాత్రధారుల యుద్ధ సన్నివేశం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న దుర్యోధనవధ ఘట్టాన్ని హరికథ రూపంలో గానం చేశారు. అనంతరం వేంకటేశ్వర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో భీమ, దుర్యోధన పాత్రధారులు యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడు యుద్ధం అనంతరం మడుగులో దాక్కొని ఉండగా భీముడు బయటకు రప్పించి, శ్రీకృష్ణుని సాయంతో అంతమొందించే సన్నివేశాలను పాత్రధారులు పద్యాలతో రక్తి కట్టించారు. వారు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. దుర్యోధనుడి ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అంతకుముందు ఆలయంలో కంకణధారులైన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దంపతులతో పాటు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, నాగభూషణంరెడ్డి, గణేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లె పంచాయతీ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి భూమి సిద్ధం


రొంపిచెర్లలో పంపిణీకి సిద్ధం చేసిన భూమి

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో ఇళ్ల పట్టాల పంపిణీకి భూమిని సిద్ధం చేసినట్లు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆదివారం తెలిపారు. గ్రామ పంచాయతీలోని డంపింగ్ యార్డ్ వద్ద 300 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు భూమిని చదును చేశామని తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో సొంత ఇల్లు లేకుండా ఎవరూ ఉండ కూడదని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ఏడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి వాటిలో ఇళ్ల పట్టాలను ఇస్తున్నామని అన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

పెద్దపంజాణి: మండలంలోని తుర్లపల్లె హరిజనవాడలో శ్రీఎల్లమ్మ ఆలయ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చెక్క భజనలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం ఉదయంతో జాతర పరిసమాప్తం కానుంది.

రామకుప్పంలో..

రామకుప్పం: మండల కేంద్రంలోని శ్రీగంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. రైతు సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు జాతర జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


పెద్దపంజాణి: విశేష అలంకరణలో అమ్మవారు

గణనాథుని సేవలో ప్రముఖులు


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు


ఆలయంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ పాటిల్, శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ వెంకటేశు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవ రెడ్డి, ఐరాల తహసీల్దార్ సుశీల పాల్గొన్నారు.

ఆహ్లాదం.. నగర వనం

- జిల్లాలో చిత్తూరు, పలమనేరులో నిర్మాణ పనులు
- కుప్పం, కార్వేటినగరంలో అనుమతులు మంజూరు

నానాటికీ నగరం, పట్టణాల్లో పెరిగిపోతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. వాతావరణంలో కర్బన ఉద్గారాల శాతం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించే దిశగా నగర వనాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తోంది. విశాలమైన ప్రాంతం పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, చుట్టూ అడవి, ప్రవేశ ఆర్చీలతో నగరవన ప్రాంతాన్ని సుందరంగా నిర్మిస్తున్నారు. జిల్లాలో నిర్మిస్తున్న నగర వనాలపై కథనం.

చిత్తూరు కార్పొరేషన్: పచ్చదనం పెంపు, ప్రజలకు వినోదం, ఉల్లాసం, ఆరోగ్యం- కాన్సెప్ట్‌తో నగర వనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపక్రమించింది. చిత్తూరులోని ఆర్వీఎస్ నగర్ వద్ద, పలమనేరు, నగరవనాల పనులకు పూనుకుంది. అలాగే జిల్లాలోని జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. పర్యాటకులకు ఆకట్టుకునే విధంగా ఈ వనాల్లో వసతులు కల్పించడంతో పాటు సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

నగరవన యోజన పథకం

జిల్లాలో జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వనాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి హెక్టార్‌కు రూ.4 లక్షల చొప్పున నిధులు ఇవ్వనున్నారు. చిత్తూరు నగరవనానిన 50 హెక్టార్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు విడుదల చేశారు. అక్కడ రూ.11.66 లక్షలతో 2 బోర్లు వేసి, మోటార్ ఏర్పాటు చే, నీటి వసతి కల్పించారు. ఆర్చి, ఫెన్సింగ్, ఇతర అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు వ్యయం చేశారు. నర్సరీలో పూలమొక్కలు, షో మొక్కల కోసం రూ.20 లక్షలు వెచ్చించారు. పిల్లల కోసం జారుడు బండ, ఉయ్యాల ఇలా మొత్తం 12 ఆట వస్తువులకు రూ.18 లక్షలు, పార్కుకు నీటి సరఫరా పైపులైన్, ఇతర పనులకు రూ.8 లక్షలు, వాకింగ్ ప్రాంతం ఏర్పాటుకు రూ.8.48 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.1.06 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన సదుపాయాలు కల్పిపంచి, మరో మూడు నెలల్లో నగర వనాన్ని ప్రారంభించాలనే ధ్యేయంతో పనులు చేస్తున్నారు. అలాగే పలమనేరులో 20 హెక్టార్లలో వనం నిర్మాణ పనులు చేస్తున్నారు. అక్కడ కూడా బోరు వేసి నీటి వసతి కల్పించారు. వీటితో పాటు పిల్లల పార్కు, రాశివనం, వాకింగ్‌ట్రాక్, నర్సరీ ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.20 లక్షలు ఖర్చు పెట్టారు.



పలమనేరు నగరవనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డి


చిత్తూరులో సిద్ధమవుతున్న పిల్లల పార్కు

మరో రెండు ప్రాంతాల్లో ..

కుప్పం, కార్వేటినగరంలో వనాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు కేటాయించింది. ప్రతి నగర వనంలో వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్ని ఇచ్చే మొక్కలు, రచ్చబండ తరహాలో బెంచీలు, టాయిలెట్లు, లైటింగ్, ఆర్చ్, ఆర్వో ప్లాంట్, పార్కింగ్ ఏరియా, పిల్లలకు ఆటవస్తువులు సమకూర్చనున్నారు.

ప్రకృతి ఒడిలో రిలాక్స్



జిల్లాలో నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తోంది. కుటుంబ సభ్యులతో ప్రకతి ఒడిలో సేద దీరేందుకు వీటిని నిర్మిస్తున్నాం. చిత్తూరు, పలమనేరులో పనులు జరుగుతున్నాయి. కార్వేటినగరం, కుప్పంలో వనాల ఏర్పాటు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ